
సాక్షి
గుంటూరు

ఆదివారం । 31 । మార్చి । 2024



'రుక్మిణీ హరణం'లో స్వామి దర్శనం
మంగళగిరి : నగరంలోని లక్ష్మీనృసింహస్వామి శనివారం రుక్మిణీహరణం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.



సాగర్ నీటి మట్టం
విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
గుంటూరు	6.26	4.46
నరసరావుపేట	6.28	4.48
బాపట్ల	6.26	4.46

న్యూస్‌రీల్

లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం రూ.50.97 లక్షలు



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి మూడు నెలల హుండీ ఆదాయం రూ.50,97,560 సమకూరినట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి తెలిపారు. ఆలయ దిగువ సన్నిధి ఆలయ ముఖ మండపంలో శనివారం స్వామి వారి ఎగువ, దిగువ సన్నిధుల హుండీలతోపాటు ఘాట్ రోడ్డుపై వేంచేసి ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించారు. ఎగువ సన్నిధిలో రూ.22,64,753, దిగువ సన్నిధిలో రూ.27,34,753, వేంకటేశ్వరస్వామి ఆలయం రూ.62,211, అన్నదానం కోసం రూ.36,098 ఆదాయం చేకూరినట్లు తెలిపారు. గత మూడు నెలల కంటే రూ.9,49,179 అధికంగా ఆదాయం సమకూరిందని తెలిపారు. హుండీ లెక్కింపును సీతానగరం గ్రూపు దేవాలయాల ఈఓ బి.శివారెడ్డి పర్యవేక్షించారు.

సాగర్‌ను సందర్శించిన దమ్మా ఫౌండేషన్ సీఈఓ



విజయపురిసౌత్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను శనివారం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దమ్మా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీలంక బౌద్ధ గురువు నివిటి గాల బంతే ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన సుగత కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహా లదువే నంద రతన బంతే సందర్శించారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధ వనాన్ని సందర్శించిన వీరు బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి, వందన సమర్పించిన అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో శ్రీలంక బౌద్ధ సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేశారు. అనంతరం వీరు నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ భద్రపరిచిన బుద్ధ ధాతువు వీక్షించి ప్రార్థనలు చేశారు. వీరి వెంట సికింద్రాబాద్ ఆనంద బుద్ధ విహార సంఘ పాల బంతే, ఏలే నాగన్న, నాగార్జునకొండ మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏప్రిల్ 27న జరగనున్న ఏపీ పాలిసెట్–2024కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలనుకునే విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. టెన్త్‌లో ఉత్తీర్ణులైన, ప్రస్తుతం టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు శిక్షణకు అర్హులని, శిక్షణ కోసం నమోదు చేసుకున్న విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉచిత మెటీరియల్ పంపిణీ చేస్తామని తెలిపారు. పాలిసెట్–2024కు దరఖాస్తు చేసుకోవాల్సిన విద్యార్థుల కోసం కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు పంపుకోవచ్చునని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు టెన్త్ హాల్ టికెట్, సెల్ నంబరు, పుట్టినతేదీ, విద్యార్థి తండ్రి పేరు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, విద్యార్థి సంతకంతో రావాలని సూచించారు. పాలిసెట్ పరీక్ష నిమిత్తం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 చొప్పున ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాలిసెట్‌లో టెన్త్ సిలబస్ ఆధారంగా గణిత, భౌతిక, రసాయశాస్త్ర విభాగాల్లో 120 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయని, ఏప్రిల్ 5న దరఖాస్తు గడువు ముగియనున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

తాడికొండ: రాష్ట్రంలోని ఏపీ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో అన్ని సీట్లలో, 6,7,8 తరగతులలో ఖాళీ గా ఉన్న సీట్లలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు ఏప్రిల్ 05వ తేదీ వరకు పెంచినట్లు తాడికొండ ఏపీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ పి జోగారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 25న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఉదయం 10–12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి 9391005515, 9391005813, 9391005812 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై
భగ్గుమన్న దళితులు

● లాడ్జి సెంటర్‌లో నిరసన ● చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ ● అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

పట్నంబజారు: నిరుపేద కుటుంబానికి చెందిన టిప్పర్ డ్రైవర్, దళితుడైన శింగనమల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీరాంజనేయులును ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై దళితులు భగ్గుమన్నారు. దళిత ద్వేషి చంద్రబాబు అంటూ నినదించారు. తక్షణమే చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో శనివారం లాడ్జి సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న దళితులు, డ్రైవర్‌లు చంద్రబాబుకు వ్యతిరేకంగా చేసిన నినాదాలతో ఈ ప్రాంతమంతా హోరెత్తింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత బత్తుల దేవానంద్ మాట్లాడుతూ పేదలు, దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి అలుసేనని అన్నారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలోనే ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా... అంటూ బహిరంగ సభలోనే బాహాటంగా అవహేళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తోకలు కత్తిరిస్తానంటూ బీసీలను బెదిరించి తన కులోన్మాదం చాటుకున్నారని విమర్శించారు. బడుగు, బలహీనవర్గాలంటే బాబు దృష్టిలో వారు కేవలం తమకు ఓట్లు వేసి,



గుంటూరులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ విభాగం నేతలు

అగ్రకుల దురహంకారుల అడుగులకు మడుగులొత్తే వారు అన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి కష్టపడి ఎంఏ బీఈడీ చేసిన వీరాంజనేయులు కుటుంబ పోషణ కోసం ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారని, ధనబలం, కుల బలం లేని ఆయనకు వైఎస్సార్ సీపీపై ఉన్న సంపూర్ణ విశ్వాసం, ప్రజాసేవ చేయాలనే తలంపు, నిజాయితీ, నిబద్ధతను గుర్తించి శింగనమల టికెట్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గౌరవించారని కొనియాడారు. కష్టపడి రాజకీయాల్లో పైకొచ్చిన జగన్ వంటి నేతలకు మాత్రమే సామాన్యులు, దళితుల గురించి సవ్యంగా ఆలోచన చేసే గుణం ఉంటుందని స్పష్టం చేశారు. 40 ఏళ్ల రాజకీయం, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు తన హయాంలో నిరుద్యోగాన్ని పెంచి పోషించినందునే ఎందరో నిరుపేద దళిత బిడ్డలు ఉన్నత చదువులు చదివి కూడా టిప్పర్ డ్రైవర్లుగా, కూలీలుగా మారిపోయారని పేర్కొన్నారు. ఇప్పుడా పరిస్థితిని సీఎం వైఎస్ జగన్ చక్కదిద్ది ఎస్సీలను అన్ని రంగాలలో బలోపేతం చేశారన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, కార్పొరేటర్లు దూపాటి వంశీ, బూసి రాజలత, బోడపాటి కిషోర్, గనిక ఝాన్సీ, మేకా రవి, మాదాసు కిరణ్, ఆలా కిరణ్, ప్రభు, మాదాసు భాగ్యారావు, దాసు, మోహన్, అరుణ్, ప్రసన్న, సాంబశివరావు పాల్గొన్నారు.

వీరాంజనేయులు నిబద్ధతను గుర్తించే టికెట్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం, ప్రజలకు సేవ చేయాలనే భావన సంపూర్ణంగా కలిగిన పేద దళిత కుటుంబానికి చెందిన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు నిబద్ధతను గుర్తించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శింగనమల అసెంబ్లీ అభ్యర్థిగా నియమించినట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు అత్తోట అమృతరాజు శనివారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. దీనిని అవహేళన చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. చంద్రబాబు మాటలు పేదలు, దళితులను కించపరచేలా ఉన్నాయని అన్నారు. ఎంఏ, బీఎడ్ చదివి కుటుంబ పోషణ కోసం గౌరవంగా టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న వీరాంజనేయులుపై చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ శ్రేణులతో రాష్ట్ర మంత్రి విడదల రజిని

బ్రాహ్మణ హితైషి జగన్

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నగర ఉపాధ్యక్షుడు చింతపల్లి

పట్నంబజారు: సమాజమంతా సుఖంగా ఉండాలని నిత్యం భగవంతుడిని కోరుకునే బ్రాహ్మణుల క్షేమం కోరే.. బ్రాహ్మణహితుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని అన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారని తెలిపారు. టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు, గుంటూరు నగర టీడీపీ ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకట రమణారావు తన అనుచరులు, పెద్ద సంఖ్యలో బ్రాహ్మణ కుటుంబాలతో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రజిని పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజికవర్గానికి చంద్రబాబు అన్యాయం చేశారని తెలిపారు. 2014, 2019 ఎన్నికలతోపాటు తాజా ఎన్నికల్లోనూ బ్రాహ్మణ సామాజికవర్గానికి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. మరోవైపు వైఎస్సార్ సీపీలో బ్రాహ్మణులకు అత్యంత గౌరవ మర్యాదలు దక్కుతున్నాయని చెప్పారు. కోన రఘుపతిని డిప్యూటీ స్పీకర్, మల్లాది విష్ణు లాంటి నాయకులకు మంచి పదవులు ఇస్తున్న పార్టీ తమదని చెప్పారు. అన్నారు. చంద్రబాబు హయాంలో విజయవాడ నగరంలో పలు ఆలయాలను ఇష్టారాజ్యంగా కూల్చివేస్తే జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వాటన్నింటిని పునర్నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు.

బ్రాహ్మణ సామాజికవర్గానికి అన్యాయం చేసిన టీడీపీ

టీడీపీ ఆవిర్భావం నుంచి బ్రాహ్మణ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తూనే ఉందని టీడీపీకి రాజీనామా చేసిన చింతపల్లి వెంకట రమణారావు అన్నారు. తాను 2014 నుంచి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, ఆ పార్టీ 2014, 2019, 2024 ఎన్నికలలో ఒక్క సీటు కూడా బ్రాహ్మణులకు కేటాయించలేదని అన్నారు. తాను ఆత్మగౌరవం చంపుకొని పార్టీలో ఇమడలేక పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో బుద్ధా ఆంజనేయులు, అనఘా సుబ్రహ్మణ్యం, జి.రామలక్ష్మి, ఎల్లాప్రగడ వసుమతి, చింతపల్లి అనూరాధ, ఎం.రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

వైఎస్సార్‌సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

తెనాలి: ఒకే కుటుంబ పాలనలో ఉన్న పొన్నూరులో పాతికేళ్లలో జరగని అభివృద్ధిని కేవలం అయిదేళ్లలోనే తాను చేసి చూపించానని, దీనిపై బహిరంగ చర్చకు రాగలరా? అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సవాల్ విసిరారు. తాను చేసిన అభివృద్ధిని జీర్ణించుకోలేక తనపై అవినీతి బురద చల్లుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో శనివారం రాత్రి తెనాలి రూరల్ మండల పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశానికి తెనాలి మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి, సంక్షేమం చేసినందునే తనకు ఎంపీ టికెట్‌ను పార్టీ కేటాయించిందన్నారు. పదేళ్లుగా టీడీపీ ఎంపీ, గుంటూరు ఖ్యాతిని మరుగున పెట్టారని 2014లో గెలిచినపుడు తెనాలిలో పరిశ్రమను స్థాపించి ఉద్యోగాలను ఇస్తానని చెప్పిన హామీని నిలుపుకోలేదని గుర్తుచేశారు. అయిదేళ్లుగా ఆయన నియోజకవర్గంలో కనిపించిందే లేదన్నారు. మళ్లీ ఇప్పుడు మరొకరు అమెరికా నుంచి వచ్చి, సిట్టింగ్ ఎంపీని మరిపిస్తానని అంటున్నారని, ఆయన్ను చూడాలంటే అమెరికా వెళ్లాల్సి వస్తుందేమోనని వ్యాఖ్యానించారు. తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరూ ఎన్నికల ముందొచ్చి ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా విమర్శలు చేస్తున్నారని అన్నారు. అయిదేళ్లలో తాను 27 వేల



సభలో మాట్లాడుతున్న కిలారి వెంకట రోశయ్య

మందికి ఇళ్లస్థలాలను ఇచ్చాననీ, రూ.1800 కోట్ల సంక్షేమాన్ని అందించానని చెప్పారు. జనసేన తరఫున పోటీచేస్తున్న అభ్యర్థి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఏ కంపెనీని తీసుకొచ్చాడు? ఎంతటి సంక్షేమం అందించాడో చెప్పాలని నిలదీశారు. ప్రతిపక్ష కూటమి ఎంపీ, పదేళ్లుగా ఎన్నికలప్పుడు మినహా కనిపించని ఎమ్మెల్యే అభ్యర్థి...ఇద్దరు టిడ్కో ఇళ్లను సందర్శించటం ఏమిటని, వారికేం సంబంధమని శివకుమార్ ప్రశ్నించారు. వాటి నిర్మాణం ఆరంభించిన మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజా అడిగితే సబబుగా ఉంటుందన్నారు. రెండుచోట్ల నిర్మాణం చేసిన టిడ్కో ఇళ్లను జగ్గడిగుంటపాలెంలో పూర్తిచేయటమే కాకుండా, అప్పటి లబ్ధిదారులకే ఇచ్చినట్టు గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా మండలంలో భారీ మెజారిటీ దిశగా కృషిచేద్దామని చెప్పారు. తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి అనిల్‌కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు లుక్కా శ్రీరామ్ తదితరులు మాట్లాడారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరువెస్ట్: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా అన్ని రాజకీయపార్టీలు తమ ప్రచారాలకు సంబంధించి మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ నుంచి విధిగా దరఖాస్తులు సమర్పించి అనుమతులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అనుమతులకు నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఎన్నికల నియమావళికి సరిపోయిన వాటికి అనుమతులు కూడా మంజూరు చేశామన్నారు. సమావేశంలో ఎంసీఎంసీ సభ్యులు ఆర్డీఓ పి.శ్రీకర్, నోడల్ అధికారి గాలిదేముడు, సభ్యులు పాల్గొన్నారు.

తుపాకులను స్వాధీనం చేయండి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తుపాకులను స్థానిక పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నియమావళి ప్రకారం తుపాకీ లైసెన్స్ ఉన్నవారు తక్షణం స్వాధీనం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా పోలీస్ యంత్రాంగం తుపాకులు కలిగి ఉన్న వారి జాబితా తయారు చేసిందన్నారు. ఎన్నికలు ముగియగానే తిరిగి వాటిని తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఎస్పీ తుషార్ డూడీ, డీఆర్వో పెద్ది రోజా, అడిషనల్ ఎస్పీ సక్కి నిసికేస్ ఉన్నారు.

వలంటీర్లపై విషం కక్కిన విపక్షం

శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించడం ఎవరి తరమూ కాదని విపక్షాలకు తెలిసిపోయిందని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. అందుకే ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేపడుతున్నారని, అందులో భాగంగానే వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి వీల్లేదంటూ పదే పదే ఇటు కోర్టులో అటు ఎన్నికల కమిషన్‌కు పిటీషన్లు పెట్టారని విమర్శించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులను ఇక్కట్లకు గురిచేసే ఈ విపరీత పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారనీ.. రానున్న ఎన్నికల్లో వారి డిపాజిట్లు గల్లంతు చేసే రీతిలో ఓడించి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమాజ సేవ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన సేవకులు వలంటీర్లని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు కరోనా సమయంలో అందించిన సేవలు అందరికీ తెలిసిందేనన్నారు. గతంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణం చేయాల్సి వచ్చేదని, కేవలం పచ్చ చొక్కా ధరించిన వారికి లేదా ఇంటిపై పచ్చ జెండా ఎగరేసిన వారికి మాత్రమే లబ్ధి చేకూరేదని ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రజలకు ఆ ఇబ్బంది తొలగిపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఏజెంట్ కుహనా మేధావి ముసుగులో ఎలక్షన్ కమిషన్‌కి పిటీషన్ పెట్టి వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా చేశారన్నారు. దీని వలన ఎవరికి నష్టమో ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞులైన ప్రజలతో పాటు ప్రజాస్వామ్యవాదులు సైతం ఆలోచన చేయాలనీ.. దీనిపై నిరసన గళం విప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు శ్రీనివాసరావు, దళిత మేధావి ముత్యం, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ లేళ్ల అప్పిరెడ్డి

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5600, గరిష్ఠ ధర రూ.7600, మోడల్ ధర రూ.6700 వరకు పలికింది.



నిబంధనలను తుంగలో తొక్కిన ధూళిపాళ్ల

- నంగం డెయిరీ బోర్డు సమావేశానికి ఎన్నికల గుర్తుతో హాజరు
- ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు

పొన్నూరు: పాడి రైతులకు చెందిన సంగం డెయిరీలో తెలుగుదేశం పార్టీ రాజ్యమేలుతోంది. ఆ డెయిరీలో వేల మంది పాడి రైతులు పార్టీలకతీతంగా సభ్యత్వం కలిగి ఉన్నారు. సంగం డెయిరీ చైర్మన్‌గా కొనసాగుతున్న ధూళిపాళ్ల నరేంద్ర పొన్నూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఉన్నారు. శనివారం డెయిరీ ఉద్యోగులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి నరేంద్ర చైర్మన్ హోదాను మరిచి టీడీపీ అభ్యర్థిగానే పాల్గొన్నారు. టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్ ఉన్న టీ షర్టు ధరించి సమావేశానికి హాజరయ్యారు. పాడి రైతులకు సంబంధించి అభివృద్ధి, డెయిరీ ఆదాయ లావాదేవీలపై జరిగిన సమావేశంలో టీడీపీ అభ్యర్థిగా నరేంద్ర పాల్గొనడం పట్ల బోర్డు డైరెక్టర్లు, ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. సమావేశం అనంతరం మీడియాతో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతున్న వీడియోలు వైరల్ కావడంతో నరేంద్ర వ్యవహారశైలి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ హోదాలో పాల్గొనాల్సిన నరేంద్ర, టీడీపీ గుర్తుతో హాజరుకావడం విమర్శలకు తావిస్తోంది.



మీడియాతో మాట్లాడుతున్న నరేంద్ర



విలేకరులకు అందజేసిన గిఫ్ట్ బాక్సులు

సంగం డెయిరీలో జరిగిన సమావేశం ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉందని సంబంధిత ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విలేకరులకు తాయిలాలు..

సమావేశంలో పాల్గొన్న విలేకరులకు ధూళిపాళ్ల నరేంద్ర తాయిలాలు అందజేశారు. పార్టీ గుర్తుతో పాల్గొన్న నరేంద్ర ఏ హోదాలో గిఫ్ట్ బాక్సులు అందజేశారో తెలియక విలేకరులు సతమతమయ్యారు.

టెన్త్ స్పాట్ వాల్యూయేషన్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ
- మూల్యాంకన విధులకు 1,200 మంది ఉపాధ్యాయులు
- ఎనిమిది రోజుల్లో రెండు లక్షల స్క్రిప్ట్‌లకు మూల్యాంకనం
- స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం గుంటూరు నుంచి పెదకాకానికి మార్పు
- రేపు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో రిపోర్టు చేయాలి: డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ స్పాట్ వాల్యూయేషన్‌కు గుంటూరు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎనిమిది వరకు జరగనున్న స్పాట్ వాల్యూయేషన్ విధులకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ఉపాధ్యాయులను నియమించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన రెండు లక్షల జవాబు పత్రాలను ఎనిమిది రోజుల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మూల్యాంకనం చేయాల్సి ఉంది. సబ్జెక్టుల వారీగా అవసరమైన ఉపాధ్యాయులను చీఫ్ ఎగ్జామినర్, ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమిస్తూ, వారికి ఆర్డర్ కాపీలను పంపిన విద్యాశాఖాధికారులు వారిని విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రెండు లక్షల స్క్రిప్ట్‌లకు గాను, ప్రతి ఉపాధ్యాయుడు రోజుకు 40 చొప్పున పేపర్లను మూల్యాంనం చేయాల్సి ఉంది. మూల్యాంకన విధుల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉంటారు. టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ విధులకు నియమితులైన ఉపాధ్యాయులు సోమవారం ఉదయం 9.00 గంటలకు గుంటూరు శివారు పెదకాకానిలోని అమెరికన్ ఆంకాలజీ సెంటర్ పక్కన ఉన్న సెయింట్ జోసఫ్ సీబీఎస్ఈ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో రిపోర్టు చేయాలని డీఈవో పి.శైలజ ఆదేశించారు. విధులకు హాజరు కానున్న ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తూ వచ్చిన స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో టాయిలెట్ల కొరత ఉండేది. దీంతో ప్రధానంగా మహిళా ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో ప్రస్తుత ఏడాది స్పాట్ వాల్యూయేషన్ కోసం అన్ని వసతులు కలిగిన పాఠశాలను ఎంపిక చేయడంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తీరినట్లే. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సూచన మేరకు గుంటూరులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి విజయవాడకు వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరంలో హైవే పక్కన ఉన్న సెయింట్ జోసఫ్ సీబీఎస్ఈ పాఠశాలలో స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని ఏర్పాటుచేసిన సెయింట్ జోసఫ్ సీబీఎస్ఈ హైస్కూల్

చంద్రబాబుకు దళితులు, పేదలంటే చిన్నచూపు

గుంటూరు రూరల్: చంద్రబాబుకు మొదటినుంచి దళితులన్నా, పేదలన్నా చిన్నచూపని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సుందర్ రెడ్డి తెలిపారు. శనివారం పెదపలకలూరులో మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఎంఏ బీఈడీ చదివి కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వీరాంజనేయుల నీతి నిజాయితీ, కష్టపడే తత్వం, సేవా తత్పరతను మెచ్చి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించారన్నారు. అటువంటి వీరాంజనేయులను కించపరుస్తూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబుకు నీతిగా నిజాయితీగా ఉండే పేదలంటే నచ్చదని, అందుకే రానున్న ఎన్నికల్లో కార్మికులంతా బుద్ధి చెప్పాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు



మున్నంగి(కొల్లిపర): మండలంలోని మున్నంగి గ్రామ సమీపంలో కృష్ణా నది ఇసుక రీచ్ వద్ద అదే గ్రామం ఎస్సీ వర్గానికి చెందిన ఇరువర్గాలు ఒకరిపై దాడులు చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన వేమూరి బాలరాజు, వేమూరి అశోక్, వేమూరి రాజేష్ తదితరులు ఇసుక తీయటం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయనీ, కావున త్రవ్వకాలు ఆపాలని ఇసుక తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్లలను ఆపారు. దీంతో రీచ్ వద్ద పనులు చేస్తున్న అదే గ్రామానికి చెందిన వేమూరి మోషే, వేమూరి చింతయ్య, వేమూరి అంజిలు ఇసుక లారీలు ఆపవద్దు అంటూ వచ్చిన వారిపై దాడికి దిగారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కత్తులు, రాడ్డులు, ట్రాకర్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడులలో ఇరువర్గాలు గాయపడ్డారు. దాడిలో వేమూరి బాలరాజు తీవ్రంగా గాయపడగా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో రూ. కోటికి పైగా స్వాధీనం

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకూ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రూ. 1.30 కోట్ల విలువైన నగదు, మద్యం ఇతర వస్తువులను గుర్తించి సీజ్ చేశారని కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో రూ. 2.44 లక్షలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ. లక్షకు పైగా నగదుకు సరైన ఆధారాలు చూపకోవడంతో దానిని కూడా సీజ్‌చేశామని పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
ఆదివారం ॥ 31-3-2024

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.



వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు



వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలై పోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్‌షిప్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ-బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో-ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్-ఇన్-ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండాకాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పూ!

ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే 'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించే వారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?



హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. **ప్రెగ్నెన్సీ:** స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.

2. **గర్భసంచి బాగా సాగడం:** దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.

3. **నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు:** వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడే వారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.

4. **హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ:** మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రోజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.

5. **జీవనశైలి అంశాలు:** శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.



వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.

కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్టు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్నిసార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళాల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మనరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.



నివారణ...

- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- **క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స:** చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ & ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్: చెవుల సంరక్షణ కోసం...!

చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...


- పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి.
- చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు.
- అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్ల) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.

రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.



గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- డయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియకపోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపథిక్ డయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...

- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తూ ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్-రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రోటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మనరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు...

- శ్వాస సరిగా అందకపోవడం
- కాళ్ల / పాదాల వాపు
- బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ)
- తీవ్రమైన అలసట
- కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.


నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్-రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు...

- గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా.
- రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా.
- గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా.
- మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై-యూరెటిక్స్‌తో

- రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ - కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో.
- రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో.
- గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు.
- గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫిబ్రిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు.
- గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా.
- లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు...
- గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో...
- చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్